మట్టికరిచిన మనువాదులు

మునుగోడు ప్రజలకు కెవిపిఎస్ ధన్యవాదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటర్లు మనువాదులను మట్టికరిపించారనీ, వారికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలుపుతున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మునుగోడు ఫలితం రాష్ట్రంలో మనువాదుల ఆటలు సాగవని తెలిపిందని పేర్కొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పులు బాధ తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో ఆదివారం జరిగింది. కాచాపూర్ గ్రామానికి చెందిన కొమ్మురాజుల ఎల్లయ్య(50) ఐదు ఎకరాల భూమి కౌలు తీసుకుని పత్తి, వరి సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.ఐదు లక్షల అప్పు చేశాడు. వర్షాల కారణంగా పంట దిగుబడి రాలేదు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన ఎల్లయ్య పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కొమ్ము రాజుల రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కేశవపట్నం ఎస్ఐ దేశ్ చంద్రశేఖర్ తెలిపారు.

హోరాహోరీ పోరులో..

టీఆర్ఎస్‌దే హవా

- 10,309 ఓట్ల మెజార్టీతో ప్రభాకర్‌రెడ్డి గెలుపు
- చివరి రౌండ్ వరకు ఉత్కంఠ...
- కమలానికి కలిసి రాని చౌటుప్పల్, చండూర్
- గెలుపులో వామపక్షాలే కీలకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికలో బిజెపి ఘోరపరాజయం చవిచూసింది. తొలి రౌండ్ నుంచి ఉత్కంఠరేపిన ఫలితం చివరకు టిఆర్ఎస్‌నే వరించింది. నల్లగొండలోని ఆర్‌జి బావి వద్ద ఎఫ్‌సిఐ గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్లలెక్కింపు ప్రారంభమైంది. 47 మంది పోటీలో ఉన్న ఈ ఎన్నికలో తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కించారు. ఇందులో టిఆర్ఎస్‌కు 194 ఓట్ల మెజార్టీ వచ్చింది. మొదటి రౌండ్‌లో చౌటుప్పల్ మండలం ఓట్లను లెక్కించగా.. టిఆర్ఎస్‌కు 1292 ఓట్ల మెజార్టీ వచ్చింది. రెండు, మూడు రౌండ్లలో బిజెపికి మెజార్టీ రాగా, నాలుగో రౌండ్ నుంచి మొదలుకొని చివరి రౌండ్ వరకు టిఆర్ఎస్ ఆధిక్యత చూపిస్తూ వచ్చింది.

ప్రతి రౌండ్‌లోనూ స్వల్ప ఓట్ల తేడా మెజార్టీ వస్తుండటంతో ఫలితాలు ఉత్కంఠంగా సాగాయి. 10,309 ఓట్ల మెజార్టీతో టిఆర్ఎస్ మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో బిజెపి, మూడో స్థానంలో కాంగ్రెస్ నిలిచింది. కాగా, టిఆర్ఎస్ అభ్యర్థికి 97,006 ఓట్లు, బిజెపికి 86,697, కాంగ్రెస్‌కు 23,906 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి తమ గుర్తింపు నిలుపుకుంది కానీ డిపాజిట్‌ను కోల్పోయింది. నాలుగో స్థానంలో బహుజన సమాజ్ పార్టీ నిలిచింది ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థులు రోలర్ గుర్తు అభ్యర్థి, చపాతీ రోలర్ అభ్యర్థి నిలిచారు. మిగిలిన అభ్యర్థులకు రెండు అంకెల లోపే ఓట్లు పడ్డాయి.



కూసుకుట్ల ప్రభాకర్‌రెడ్డిం

బిజెపిని నిరాశపర్చిన చౌటుప్పల్, చండూర్ మండలాలు

బిజెపికి అనుకూలంగా ఉన్న చౌటుప్పల్, చండూరు మండలాల్లో టిఆర్ఎస్ అధిక్యత చూపించడంతో బిజెపి శ్రేణుల్లో నిరాశ మిగిల్చింది. ముఖ్యంగా బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ మండలంలో సుమారు ఐదు వేల పైచిలుకు ఓట్లు ఆధిక్యత వస్తుందని భావించారు. అదేవిధంగా చండూరు పట్టణంలో మెజార్టీ వస్తుందని ఆశించారు. ఈ రెండు మండలాల్లో మెజార్టీ వస్తే మిగిలిన మండలాల్లో మెజార్టీ రాకపోయినా 1500 నుంచి రెండు వేల ఓట్ల మెజార్టీతో బిజెపి గెలుస్తుందని ఆ పార్టీ అగ్రనేతలు భావించారు. అదే దీమాతో రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తొలుత చౌటుప్పల్ మండలం ఓట్లు లెక్కించగా పెద్దగా మెజార్టీ రాకపోవడంతో గెలుపుపై ఆశలు వదులుకున్నారు. ఇదే విషయాన్ని రాజగోపాల్ రెడ్డి కౌంటింగ్ హాల్ వద్ద మీడియా ముందు ప్రస్తావించారు. చండూర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చివరి రౌండ్ 15లో బిజెపి అభ్యర్థి 88 ఓట్లు సాధించాడు. టిఆర్ఎస్ పార్టీ అన్ని రౌండ్లలోనూ మెజార్టీ చూపించింది.

రౌండ్ల వారీగా పార్టీలకు పడ్డ ఓట్లు

రౌండ్.	టిఆర్ఎస్	బిజెపి	కాంగ్రెస్	బిఎస్‌పి
1.	6418	5126	2100	214
2.	7781	8622	1537	159
3.	7390	7426	1926	510
4.	4584	4555	1817	224
5.	6062	5245	2683	330
6.	6016	5378	1962	280
7.	7202	6803	1664	249
8.	6620	6088	907	297
9.	7517	6665	1684	315
10.	7503	7015	1347	248
11.	7214	5853	1788	260
12.	7448	5398	1828	310
13	6691	5406	1206	355
14.	6612	5553	1177	416
15.	1270	1358	278	148

గెలుపులో కమ్యూనిస్టులే కీలకంగా మారారు

మునుగోడు నియోజవర్గంలో బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉన్న కమ్యూనిస్టులు ఉప ఎన్నికలో టిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. నోటిఫికేషన్ నుంచి పోలింగ్ అయిపోయేంతవరకు కమ్యూనిస్టు క్యాడర్ టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం విశేష కృషి చేశారు. నిరంతరం శ్రమించి ఒక్క ఓటైనా మిస్ కాకుండా టిఆర్ఎస్ అభ్యర్థికి వేయించడంలో సఫలీకృతమయ్యారు. ఒక దశలో టిఆర్ఎస్ క్యాడర్ కంటే కమ్యూనిస్టు క్యాడరే బలంగా పనిచేసినట్టు ప్రచారం నడిచింది. చివరికి కమ్యూనిస్టులు మద్దతుతోనే టిఆర్ఎస్ గెలుపొందింది. కమ్యూనిస్టుల మద్దతు లేకపోతే టిఆర్ఎస్‌కు డిపాజిటైనా వచ్చేది కాదని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రస్తావించడం విశేషం.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

ధాన్యం తరలించాలి

- రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం శెట్పల్లి చౌరస్తా వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం తూకం వేసి 15 రోజులు అవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించలేదని దాంతో కుప్పల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరగంటపాటు రైతుల రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న లింగంపేట్ సొసైటీ చైర్మెన్ దేవేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. లారీలను కేటాయించకపోవడం వల్ల ఆలస్యం జరిగిందని, రెండు రోజులు వ్యవధిలో తూకం వేసిన ధాన్యాన్ని తరలిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆందోళన విరమించారు.

రౌడీ షీటర్లు నిర్వహిస్తున్న ముజ్రా పార్టీపై ఎస్‌ఒటి దాడులు

- 48 మంది అరెస్టు
- నగదు ఇతర వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్థరాత్రి అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా రౌడీ షీటర్లు నిర్వహిస్తున్న ముజ్రా పార్టీపై విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ జోన్ ఎస్‌ఒటి పోలీసులు ఆదివారం ఉదయం దాడులు నిర్వహించారు. 48 మందిని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి విలువైన వస్తువులు, నగదు, మరణా యుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంజపూర్‌లో జరిగింది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని మాజీ రౌడీ షీటర్ బాబా ఖాన్‌కు చెందిన సలీం ఫామ్ హౌస్ మండల పరిధిలోని రామంజపూర్‌లో ఉంది. రాజేంద్రనగర్ జిహెచ్‌ఎంసి పరిధిలోని మైలార్‌దేవ్ పల్లి ఊటపల్లి, రోషన్ కాలనీకి చెందిన షేక్ అజారుద్దీన్, మహమ్మద్ షోయబ్ ఎలక్ట్రిషియన్‌గా, హోటల్‌లో పనిచేస్తున్న స్టార్ కాలనీకి చెందిన మహమ్మద్ మహబూబ్, సైఫీ కాలనీకి చెందిన యాసీన్ అలీ ఖాన్ డ్రైవర్‌గా, శాలిబండకు చెందిన మహమ్మద్ ముజఫర్ బట్టల దుకాణంలో వర్కర్‌గా పని చేస్తున్నారు. ఇందులో నలుగురు రౌడీషీటర్లు యాసిన్, మహబూబ్, అజార్, సోహైల్ ఉన్నారు. వీరికి మాజీ రౌడీషీటర్ బాబా ఖాన్‌తో ఇటీవల సాన్నిహిత్యం పెరిగింది. దాంతో ఆ రౌడీషీటర్లకు రామంజపూర్‌లోని తన సలీం ఫామ్‌హౌస్‌ను ముజ్రా పార్టీ చేసుకోవడానికి వారికి ఇచ్చాడు. ఈ ఫామ్‌హౌస్‌లో నగరానికి చెందిన 48 మంది అక్కడికి వచ్చి ముజ్రా పార్టీ చేసుకుంటున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఒటి శంషాబాద్ జోన్ పోలీసులు ఆదివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో దాడులు నిర్వహించారు. అక్కడ ఉన్న 48 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు హిజ్రాలు, మహిళలు, పురు షులు ఉన్నారు. వారి వద్ద నుంచి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఒటి ఎడిసిపి పి నారాయణ ఆధ్వర్యంలో పట్టుబడిన వారిని, వస్తువులను నగదు శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. దాంతో పాటు వారి నుంచి విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పోలీసులకు పట్టుబడ్డ రౌడీ షీటర్లు, స్వాధీనం చేసుకున్న వస్తువులు

ప్రజలతో మాటామంతి

- హుషారుగా భారత్ జోడోయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ఆదివారం ఉదయం మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కోలపల్లి నుంచి ప్రారంభమైంది. కోలపల్లి వద్ద పిసిసి ఉపాధ్యక్షులు సురేష్ శెట్కార్, పిసిసి సభ్యులు పి సంజీవరెడ్డి, శ్రీనివాస్ శంకర స్వామి, చెంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ శెట్కార్ రాహుల్ గాంధీకి ఘనస్వాగతం పలికారు. పెద్దశంకరపేట మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాదయాత్రలో హుషారుగా పాల్గొన్నారు. పేటలో ఐబీ వద్ద మహిళలతో రాహుల్ గాంధీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన సదర్ ఉత్సవాల్లో రాహుల్ గాంధీ ఉత్సాహంగా పాల్గొన్నారు. రాహుల్‌గాంధీని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్నపిల్లలతో పాదయాత్రలో పాల్గొన్నారు. పెద్దశంకరంపేటకు చెందిన కోయిలకొండ యాదగిరి మనవడు కార్తీకేయ బ్రెయిన్‌లో వాటర్ రావడంతో అతనికి చికిత్స నిమిత్తం రాహుల్ గాంధీ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫర్ చేస్తామని హామీ ఇచ్చారు. చీలపల్లి క్రాస్ రోడ్ వద్ద రాహుల్ గాంధీ యువకులతో మాట్లాడారు. కమలాపూర్ వద్ద వెయ్యి మీటర్ల జాతీయ జెండాతో రాహుల్ గాంధీకి స్వాగతం పలికారు. రాహుల్ గాంధీ బీడీ కార్మికులు, సింగరేణి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు భారత్ జోడో యాత్ర ప్రారంభమైంది. కాగా, రాహుల్ జోడోయాత్రకు మందకృష్ణ మాదిగ మద్దతు తెలిపారు. ఎఐసిసి నేతలు దిగ్విజయ్ సింగ్, జయరాం రమేష్, పిసిసి ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు సీతక్క, సంపత్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు భూపాల్

టియుఎంహెచ్‌ఇయు మూడో మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు

- చైర్మెన్‌గా మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు, సిఐటియు అనుబంధం) రాష్ట్ర మహాసభ కోసం ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు.. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదా నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు భూపాల్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మీనా, శ్రావణ్ కుమార్, యూనియన్ రాష్ట్ర నాయకులు హరిశంకర్, కవిత, కిరణ్మయి, ఆరోగ్య మిత్ర రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ నవంబర్ 27న ఆదివారం రాష్ట్ర మూడో మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైద్యారోగ్య రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రధానంగా రెగ్యులరైజేషన్, ఇతర జీతభత్యాల సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ మహాసభ సందర్భంగా వాటిపైన తీర్మానాలు చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కరోనా కాలంలో పని చేసిన వారికి కనీసం ఇన్సెంటివ్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశించినట్టుగా సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆహ్వాన సంఘానికి మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె నాగేశ్వర్ చైర్మెన్‌గా, కె యాద నాయక్ ప్రధాన కార్యదర్శిగా, శ్రావణ్ కుమార్ కోశాధికారిగా, చీఫ్ ప్యాట్రన్లుగా జె వెంకటేష్, భూపాల్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా హరిశంకర్, కవిత కిరణ్మయి, కె బలరాం ఎండి ఫసియుద్దీన్, సుధాకర్, సంజు జార్జ్, వి విజయ వర్ధన్ రాజు, 108 వెంకన్న, సుగుణ కొండలరావు, కుమారస్వామి, వేణుగోపాల్, ప్రమీల నవీన్, యాదగిరి, షాదుల్లా ఎన్నుకున్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది : సిఇఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. లెక్కింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆదివారం సాయంత్రం హైదరాబాద్ బుద్ధభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం మొత్తం దృష్టి మునుగోడు ఉప ఎన్నికపై ఉందని.. ఎక్కడా పక్షపాతం లేకుండా ఎన్నికల ప్రక్రియ నిర్వహించామన్నారు. ఆరోపణలు ఎన్ని వచ్చినా.. నియమావళికి అనుగుణంగానే వ్యవహరించామని స్పష్టం చేశారు. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందునే ఓట్ల లెక్కింపులో ఆలస్యమైందని తెలిపారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగిందని.. ఎక్కడా లోపం తలెత్తలేదని తేల్చి చెప్పారు. వ్యక్తిగత తప్పిదం చేసినందునే ఆర్‌ఒపై వేటు పడిందని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తవడానికి సహకరించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఎన్నికల కోడ్ నవంబరు 8న ముగుస్తుందని తెలిపారు.

గెలుపోటములు సహజం

- మునుగోడు ఫలితాలపై రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నిక ఫలితాలపై ఆయన ఆదివారం ట్వీట్టర్ వేదికగా స్పందించారు. ఎన్నికల ఫలితం కంటే ఎంత నిబద్ధతతో పని చేశామన్నదే ముఖ్యమని తెలిపారు. మునుగోడులో ప్రలోభాలకు లొంగకుండా నిఖార్సుగా, నిబద్ధతగా పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ ఆధిపత్య పార్టీలు

- ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉపఎన్నికల్లో ఆధిపత్య టిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రిగ్గింగ్‌కు పాల్పడినా మునుగోడు ఓటర్లు బిఎస్‌పిని ఆదరించి 4,145 ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఓటుకు రూ.45 వేల చొప్పున పంపిణీ చేసినా నాలుగు వేల మంది ఓటర్లు స్వచ్ఛమైన, పారదర్శకమైన రాజకీయాలకు మద్దతు పలికారని తెలిపారు.

బిజెపి ఓటమి దేశ రాజకీయాల్లో మంచి పరిణామం

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి దేశ ఎన్నికల రాజకీయాల్లో మంచి పరిణామమని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నిక సందర్భంగా ప్రజాస్వామ్య విలువలపై చర్చ జరుగుతోందని తెలిపారు. డబ్బు, మద్యం ప్రలోభాలకు ఓటర్లను గురిచేయడం విచ్చల విడిగా జరిగిందని పేర్కొన్నారు. బిజెపి ఫాసిస్టు విధానాలకు ఈ ఎన్నికలు చెక్ పెట్టాయని తెలిపారు.

మునుగోడులో బిజెపికి బుద్ధిచెప్పారు

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో తిరుగేలేదని విర్రవీగుతున్న బిజెపికి ప్రజలు బుద్ధి చెప్పారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మతోన్మాద బిజెపిని నివారించడం కోసం పని చేసిన వ్యవసాయ కార్మికులందరికీ అభినందనలు తెలిపారు. డబ్బు, కుల ఆధారంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటం సాధ్యం కాదని రుజువైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోవాలనీ, టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మునుగోడు ఓటమి బిజెపికి చెంప పెట్టు

- రాజగోపాల్‌రెడ్డీ.. దిగజారుడు మాటలు మానుకో
- మునుగోడు ప్రజలకు అభినందనలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మునుగోడు ఉప ఎన్నికల ఫలితం బిజెపికి చెంపపెట్టులాంటిదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. అక్కడ గెలుపు కోసం పడరాని పాట్లు పడిందని చెప్పారు. కమ్యూనిస్టులు బలపర్చిన టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించిన ప్రజలకు సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ధన్యవాదాలు చెప్పారు. కష్టపడి పనిచేసిన సిపిఎం, సిపిఐ, టిఆర్‌ఎస్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మునుగోడులో గెలిచి, వచ్చే సాధారణ ఎన్నికల్లో తామే ప్రధాన ప్రత్యర్థిమనే సంకేతాన్ని పంపాలనే బిజెపి ఎత్తుగడను అక్కడి ప్రజలు తిప్పికొట్టారన్నారు. అక్రమ మార్గంలో గెలిచేందుకు ఎన్నో ఎత్తులు వేసిందని విమర్శించారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలను బిజెపి అప్రజాస్వామికంగా అనేక రాష్ట్రాల్లో కూల్చేసిందనీ, తెలంగాణలోనూ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయటం ద్వారా ప్రభుత్వాన్ని కూలగొట్టాలని నిస్సిగ్గుగా ప్రయత్నించిందని చెప్పారు. ఆ కుట్ర బట్టబయలు కావటంతో... ఇలాంటి తప్పుడు పద్ధతులను సహించబోరంటూ ప్రజలు తమ ఓటు ద్వారా తమ తీర్పును చెప్పారన్నారు. కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.18వేల కోట్ల కాంట్రాక్టుకు అమ్ముడుబోయి ఈ ఎన్నికలను తీసుకొచ్చారని ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు.

కాషాయ కుట్రలు సాగనివ్వం..

నైజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడిన ప్రాంతమిదని, వెట్టి, బానిసత్వం నుంచి ప్రజలను విముక్తి గావించేందుకు చైతన్యయుత ఉద్యమాలు సాగిన నేల ఇదని అన్నారు. భవిష్యత్‌లోనూ కాషాయుల కుట్రలు సాగన్విబోమని నొక్కి చెప్పారు. రాబోయే కాలంలో పరిపాలనలో ఉన్న లోపాలను సవరించుకుని కెసిఆర్ ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గర కావాల్సిన అవసరాన్ని ఈ ఫలితం సూచించిందన్నారు. ముఖ్యంగా పేదలు, గిరిజనుల పోడు భూములు, కార్మికుల, నిర్వాసిత రైతుల, మధ్యతరగతి వర్గాల, నిరుద్యోగ యువకుల సమస్యలను పరిష్కరించేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

రాజగోపాల్‌రెడ్డివి దిగజారుడు మాటలు..

ఓటమి బాధతో బిజెపి అభ్యర్థి కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓటమి అనంతరం దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నానంటూనే ఎన్నికలు అక్రమంగా జరిగాయనీ, కమ్యూనిస్టులు అమ్ముడు పోయారని అవాకులు చెవాకులు పేలడం తగదని సూచించారు. తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

ప్రజాస్వామ్య విజయం

- మునుగోడుపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

మునుగోడు ఉప ఎన్నికలో ప్రజాస్వామ్యం విజయం సాధించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బిజెపి మతోన్మాదశక్తులకు రాష్ట్రంలో తావు లేదని మునుగోడు ప్రజలు తీర్పు చెప్పారనీ, వారికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. మునుగోడులో టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకరరెడ్డి విజయం సాధించడంపై హైదరాబాద్ మగ్దూంభవన్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఆ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిజెపి, ప్రధాని నరేంద్రమోడీ, కోమటిరెడ్డి రాజగోపాల్‌కు మునుగోడు తీర్పు చెంపపెట్టు వంటిదని అన్నారు. మునుగోడు ఇప్పటికీ కమ్యూనిస్టుల కంచుకోట అని



టిఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపుతో స్పష్టమైందని తెలిపారు. రాష్ట్రంలోకి బిజెపిని రానివ్వబోమనీ, వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న ఎంపి సీట్లు కూడా వారికి రావని చెప్పారు. జాతీయ స్థాయి వరకు మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా ఇతర పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఏకీకరణ అవసరాన్ని ఈ ఎన్నిక తెలియజేస్తుందన్నారు. ఓటమి తర్వాత రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఈటీ నర్సింహారావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది

- ఆర్థిక శాఖ అధికారి డాక్టర్ సాయిరాణి

ప్రజాశక్తి - కల్చరల్

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని ఆర్థిక శాఖ అధికారి డాక్టర్ పి.సాయిరాణి అన్నారు. నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు, పద్మశ్రీ ఘంటసాల శత జయంతి ఉత్సవాల సందర్భంగా వీణాపాణి కళానిలయం ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సినీ సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ పి.సాయిరాణి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సంధ్యారాణి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంగీతం మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. అనంతరం ప్రముఖ గాయని మల్లాది కనకరత్నంకు అపర గాన కోకిల సుశీలమ్మ బిరుదును ప్రధానం చేశారు. సభకు ముందు వినపని కళానిలం వ్యవస్థాపక అధ్యక్షురాలు జిఎం శ్రీదేవి నిర్వహణలో గాయనీ, గాయకులు వరలక్ష్మి, జ్యోతి, నాగమణి, ప్రణీత, వేణుమాధవ్, కమల కుమారి, వరలక్ష్మి, విద్యాధర్, శ్రీనివాస రావు, రామోజీ, శ్రీవాత్స అలపించిన సినీ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణుడు దైవజ్ఞ శర్మ, వేణుగోపాల్ కొడిచెర్ల పాల్గొన్నారు.

మతోన్మాదంతో దేశం విచ్ఛిన్నం

- ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు
- నేడు మేనూర్‌లో భారత్ జోడో గర్జన సభ
- పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడంపైనే దృష్టి పెట్టాయే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం తమ ప్రాణాలు అర్పించారన్నారు. వారి వారసుడిగా రాహుల్‌గాంధీ విశాల దేశ ప్రయోజనాల కోసం భారత్ జోడో యాత్ర చేపట్టారన్నారు. నిఘా సంస్థలు రాహుల్ ప్రాణాలకు ముప్పు ఉంటుందని హెచ్చరించినా, కేంద్ర ప్రభుత్వం ఇడి, ఐటి దాడులతో భయపెట్టినా ప్రజల కోసం, దేశం కోసం ధైర్యంగా యాత్ర మొదలు పెట్టారన్నారు. దేశంలో అస్తవ్యస్త పరిపాలన, క్లిష్టమైన పరిస్థితులు నెలకొనడంతో పాటు ప్రజలు తమ సమస్యలు, బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ దుస్థితి నెలకొందన్నారు. యాత్రలో ప్రజలు, రైతులు, కార్మికులు, వివిధ కుల సంఘాలు, అన్ని వర్గాలవారు పాల్గొని తమ బాధలు రాహుల్‌గాంధీకి చెప్పుకుంటున్నారని అన్నారు. భవిష్యత్‌లో భారత్ జోడో యాత్ర క్విట్ ఇండియా ఉద్యమ తరహాలో చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్‌ఎస్ పాలనలో అవినీతి కంపుకొడుతోందని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులను ప్రజలు చీదరించుకొనే పరిస్థితి నెలకొందన్నారు.

నేడు మేనూర్‌లో భారత్ జోడో గర్జన సభ

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన దానికంటే ఎక్కువ సక్సెస్ అయ్యిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. సోమవారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మేనూర్‌లో భారత్ జోడో గర్జన పేరుతో లక్ష మందితో భారీ విజయోత్సవ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ సభకు తరలిరానున్నట్టు చెప్పారు. సమావేశంలో సీఎల్‌పీ లీడర్ భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపిలు పొన్నం ప్రభాకర్, మధు యాష్కీ, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎంఎల్‌సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మాజీ ఎంపి సురేష్‌శెట్కార్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి పట్టం కట్టారు

- ఈ విజయం మోడీ, షాకు చెంపపెట్టు
- తమ్మినేని, కూనంనేని సహా ఇతర నేతలకు కృతజ్ఞతలు
- ముదుగోడు ఫలితంపై మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



ఆత్మగౌరవానికి, అహంకారానికి మధ్య జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో అక్కడి ప్రజలు తమ పార్టీకి పట్టం కట్టడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపికి కర్రు కాల్చి వాత పెట్టారని టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. ఈ విజయం ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు చెంప పెట్టులాంటిదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు బుద్ధి తెచ్చుకోవాలనీ, ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఉప ఎన్నిక సందర్భంగా తమ తమ పార్టీ శ్రేణుల్ని కార్యోన్ముఖుల్ని చేయడం ద్వారా టిఆర్‌ఎస్ విజయంలో కీలక పాత్ర పోషించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఈ సందర్భంగా కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. అద్భుతమైన నిర్మాణ దక్షత కలిగిన ఆయా పార్టీలు ప్రచారంలోనూ అంతే అద్భుతంగా పని చేశాయని అన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన సిపిఎం నేతలు చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, సిపిఐ నేతలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావుతోపాటు చెమటోడ్చి పనిచేసిన కామ్రేడ్స్ అందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

మునుగోడు ఉప ఎన్నిక ఫలితం అనంతరం ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, వి.శ్రీనివాసగౌడ్ తదితరులతో కలిసి కెటిఆర్ మాట్లాడారు. మోడీ, షా బలవతంగా తెచ్చిన ఈ ఎన్నికలో మునుగోడు ప్రజలు గుద్దిన గుద్దుడుకు బిజెపికి దిమ్మ తిరిగిందని ఎద్దేవా చేశారు. మునుగోడుకు సంబంధించి ఢిల్లీ నుంచి డబ్బు సంచులు పంపారనీ, వందల కోట్లు గుమ్మరించారని చెప్పారు. బండి సంజయ్‌కు సంబంధించిన చొప్పరి వేణు, ఈటల రాజేందర్ పిఎ కొడారి శ్రీను డబ్బుతో పట్టుబడింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. డాక్టర్ వివేక్... కింగ్ పిన్‌లా వ్యవహరిస్తూ ఈటలకు డబ్బులు పంపారనీ, జమున హెచరీస్ ఖాతాలోకి రూ.25 కోట్లను మళ్లించారని వివరించారు. మరోవైపు రాజగోపాల్‌రెడ్డికి చెందిన సుశీల్ ఇన్‌ఫ్రా కంపెనీ నుంచి రూ.5.24 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించారని చెప్పారు. ఇలాంటి ఆధారాలన్నింటితో తాము ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో ఎన్నికల సంఘం వ్యవహారశైలి కూడా చాలా దారుణంగా ఉందంటూ కెటిఆర్ విమర్శించారు. రోడ్డు రోలర్ సహా తొలగించిన అనేక గుర్తులను తిరిగి బలవంతంగా లిస్టులో చేర్చారని చెప్పారు. కారును పోలిన అలాంటి గుర్తులకు దాదాపు ఆరు వేల ఓట్లు పడ్డాయని అన్నారు. దీంతోపాటు శిఖండి లాంటి రెండు పార్టీలను (బిఎస్‌పి, కెఎ పాల్) కూడా బిజెపి రంగంలోకి దించిందని చెప్పారు. సానుభూతి కోసం ఈటల డ్రామాలాడగా... బండి సంజయ్ అర్థరాత్రి హైడ్రామా నడిపారని విమర్శించారు. రాజగోపాల్‌రెడ్డికి దొంగ జ్వరం రాగా.. బీజేపీ నేతలు ఉద్యోగ సంఘాలను కూడా వదలకుండా ఆరోపణలు గుప్పించారనీ, కొందరికి డబ్బులిచ్చి అభ్యర్థులుగా రంగంలోకి దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలను ఛేదించిన మునుగోడు ప్రజలకు శిరస్సు వంచి మొక్కుతున్నానని అన్నారు. భవిష్యత్తులోనూ కమ్యూనిస్టులతో కలిసే పని చేస్తారా..? అని అడగ్గా... ఆ అంశంపై తమ పార్టీ అధ్యక్షుడు (కెసిఆర్), సిపిఎం, సిపిఐ కార్యదర్శులు మాట్లాడుకుంటారని జవాబిచ్చారు.

కామ్రేడ్లే గెలిపించారు...

- వ్యూహాత్మక నెట్‌వర్క్‌తో వినూత్న ప్రచారం
- బిజెపిని నిలువరించడంలో జయప్రదం...
- వామపక్ష, లౌకిక శక్తుల ఐక్యతకు సూచిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రంలోగానీ, దేశంలోగానీ ఎక్కడున్నార్రా కమ్యూనిస్టులు...' అంటూ అవాకులు చెవాకులు పేలిన వారికి వామపక్షాలు ధీటైన సమాధానమిచ్చాయి. దమ్ముంటే సింగిల్‌గా పోటీ చేయాలంటూ రెచ్చగొట్టిన బిజెపి నేతల సవాల్‌కు... 'కచ్చితంగా మిమ్మల్ని మట్టికరిపించే దమ్ము మాకుందంటూ' జవాబిచ్చిన సుత్తీ, కంకీ కొడవళ్లు మునుగోడులో ఆ పార్టీ దుమ్ము దులిపాయి. మతోన్మాదం, ఫాసిజంపై నికరంగా, నిక్కచ్చిగా పోరాడటంలో తమకు తామే సాటి.. అని మరోమారు నిరూపించాయి. వెరసి మునుగోడులో సిపిఎం, సిపిఐ మద్దతిచ్చిన టిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకంట్ల ప్రభాకరరెడ్డి... బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై విజయకేతనం ఎగరేశారు. ఈ విక్టరీలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తొలి రోజు నుంచి ఫలితం వచ్చిన ఆదివారం దాకా బిజెపి ఓటమే లక్ష్యంగా పని చేశాయి. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు మార్గనిర్దేశంలో ఆ రెండు పార్టీల శ్రేణులు నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ఎన్నిక జరిగే రోజు వరకూ అవిశ్రాంతంగా పని చేసి... గమ్యాన్ని ముద్దాడాయి. కారు పార్టీ విజయంలో వామపక్షాలు క్రియాశీలక పాత్రను పోషించాయి. సైద్ధాంతిక ప్రాతిపదికన మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలబడటమేగాదు.. అందుకోసం అవి నిక్కచ్చిగా పనిచేశాయి. ఈ పోరాటంలో ఎలాంటి రాజీలేదని మరోసారి స్పష్టం చేశాయి. ఇది కేవలం లెఫ్ట్ పార్టీల కార్యకర్తలు, నాయకులు చెబుతున్న మాట కాదు.. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా అంగీకరించిన వాస్తవం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బిజెపికి వ్యతిరేకంగా వామపక్ష, లౌకిక శక్తుల ఐక్యతకు బీజం పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకరకంగా ఇది తెలంగాణతోపాటు దేశంలో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటుకు సూచికగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదే జరిగితే రాష్ట్రానికి, ఇక్కడి ప్రజలకు శుభ సూచకమని వారు విశదీకరిస్తున్నారు. ఈటల లాంటి బిజెపి నేతలు సైతం కమ్యూనిస్టుల మద్దతు లేకపోతే టిఆర్‌ఎస్ గెలిచేది కాదంటూ వ్యాఖ్యానిస్తున్నారంటే మునుగోడు విజయంలో కామ్రేడ్ల ప్రాధాన్యతేంతో విదితమవుతున్నది.

'హస్తం'కు భంగపాటు

- రేవంత్ మినహా బాధ్యతలు విస్మరించిన సీనియర్లు
- పని చేయని స్రవంతి 'సెంటిమెంట్'

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల రణరంగంలో సుదీర్ఘ అనుభవం కాంగ్రెస్ పార్టీకి ఉంది. కానీ మునుగోడు ఎన్నికల్లో ఆ అనుభవాన్ని సద్వినియోగం చేసుకోలేదని చెప్పొచ్చు. పోల్ మేనేజ్‌మెంట్ బలహీనంగా ఉండడంతో కాంగ్రెస్ ఉప ఎన్నికల్లో మూడో స్థానానికి దిగజారింది. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బలమైన పునాది ఉన్నప్పటికీ డిపాజిట్ కోల్పోయి, ఘోరపరాజయం పాలైందనే విమర్శలు వస్తున్నాయి. ఏడు మండలాలకు అనుభవజ్ఞులైన సీనియర్ నేతలను నియమించినప్పటికీ వారు తమ బాధ్యతను నిర్వర్తించలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఏక్ నిరంజన్‌లా పిసిసి అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నీ తానై... ఎన్నిక క్షేత్రంలో పని చేశారు. భారత్ జోడో యాత్రను సమన్వయం చేస్తూ... రేవంత్‌రెడ్డి ఎన్నిక ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు. మరికొంత మంది నేతలు మాత్రం రాహుల్‌గాంధీని ప్రసన్నం చేసుకునేందుకు తెగ ఆరాటపడ్డారు తప్ప ఎన్నికలపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు పోల్ మేనేజ్‌మెంటులో భాగంగా ప్రతి ఓటరు కలవడంలో విజయవంతమయ్యారు. కాంగ్రెస్ నేతలు మాత్రం నామ్‌కే వాస్తేగా గ్రామాల్లో పర్యటించారు తప్ప ఓటరు కలిసే ప్రయత్నం చేయడంలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌పై బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టి సారించారు. ఈ విషయం తెలిసినప్పటికీ పార్టీ సీనియర్ నేతలు పోతేపోనీలే అన్నట్టు వ్యవహరించినట్టు స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండడం, ఆస్ట్రేలియా వెళ్లిపోవడం, ఎన్నికలు ముగిసిన తర్వాత రావడం, తమ్ముడు రాజగోపాల్‌రెడ్డికి ఓట్లు వేయాలంటూ ఫోన్లు చేయడం, ఆయన బిజెపిలో చేరుతారా? అనేది అనుమానాలు వచ్చాయి. ఈ పరిణామాలు కూడా కాంగ్రెస్‌ను దెబ్బతీశాయనే ఆవేదన వ్యక్తమవుతున్నది. పెద్ద నాయకులతోపాటు స్థానిక నాయకులు కొంత మంది అటు బిజెపితోనూ, టిఆర్‌ఎస్‌తోనూ టచ్‌లో ఉంటూ కాంగ్రెస్‌ను పట్టించుకోలేదు. ఆ పార్టీల ప్రలోభాలకు పెద్ద నాయకులే లొంగిపోయినట్టు స్థానికంగా ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో నన్ను పిసిసి అధ్యక్ష పదవి నుంచి దించే కుట్రలు చేస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి భావోద్వేగానికి గురైన విషయం తెలిసిందే. మాజీ మంత్రి దామోదరరెడ్డి, పటేల్‌రమేష్‌రెడ్డి, సీతక్క, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కైలాస్‌నేత, కృష్టారెడ్డి తదితరులు పార్టీ అప్పగించిన బాధ్యతలను బాగా నిర్వర్తించినట్టు చెప్పారు. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు స్థానికగా ఉండి బాగా కష్టపడి పని చేశారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్న నేతలు చుట్టపు చూపుగా వచ్చి పోవడమే తప్ప పార్టీ గెలవాలనే తపన కనిపించలేదు. కొంత మంది సీనియర్లు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని ఇక్కడ పని చేయకూడదంటూ పరోక్షంగా బెదిరించినట్టు తెలిసింది. మరోవైపు కాంగ్రెస్ తీసుకున్న కాళ్లు మొక్కుతాం, ఆడబిడ్డను సాదుకుంటారో, చంపుకుంటారో అంటూ రగిల్చిన సెంటిమెంట్ కూడా ప్రభావాన్ని చూపలేకపోయింది. ఎన్నిక రోజు పోలింగ్ బూత్‌ల వద్ద కాంగ్రెస్‌కు ఓటేయండి అని కనీసం చెప్పేవారు కూడా కరువయ్యారు. బిజెపి, టిఆర్‌ఎస్ పార్టీలు ఓటర్లను బూత్‌లకు తరలించి వారి ఓట్లు సాధించేందుకు శక్తిమేరకు కృషి చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఇది ఎక్కడా కనిపించలేదు. దాంతో కరుడుగట్టిన కాంగ్రెస్ నేతలు తప్ప మిగతా వారెవ్వరూ ఆ పార్టీకి ఓటు వేయలేదు. దీని ఫలితంగా కాంగ్రెస్ ఓడిపోయిందని నాయకులు విశ్లేషణలు చేస్తున్నారు.

బిజెపికి భంగపాటు

- ముంచిన ఓవర్ కాన్ఫిడెన్స్
- రాజగోపాల్‌రెడ్డి దుందుడుకు చర్యలతో పార్టీకి నష్టం
- నాయకులను సమన్వయం చేయడంలో బండి విఫలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతిగా ఊహించి ఉప ఎన్నికకు ఉరికిన బిజెపి మునుగోడులో బొక్కబోర్లా పడింది. నోటిఫికేషన్‌కు ముందు నుంచే క్షేత్రస్థాయిలో ఆర్‌ఎస్‌ఎస్ బలగాలను మోహరించి ఏదో చేయాలని చూసినా... వామపక్ష భావజాలమున్న మునుగోడు ఓటరు దాన్ని తిప్పికొట్టారు. రాష్ట్రంలో అంతంతగానే ఉన్న బిజెపి.. సరిగ్గా ఉప ఎన్నికకు నాలుగైదు రోజుల ముందు అధికార పార్టీ ఎమ్మెల్యేల కొనుగోళ్ల పర్వానికి పూనుకోవడం, అది బట్టబయలవ్వడం వంటి పరిణామాలు రాజగోపాల్‌రెడ్డికి తీవ్ర నష్టాన్ని చేకూర్చాయి. కాంగ్రెస్ పార్టీ లైట్‌గా తీసుకోవడం, సీనియర్లు స్రవంతికి సహకరించకపోవడం వంటి వాటితో కొంతమేర బిజెపికి కలిసొచ్చిందిగానీ లేకుంటే అంతే. కాంగ్రెస్ పార్టీ గనుక క్షేత్రస్థాయిలో ఇంకాస్త గట్టిగా పోరాడినా, పెద్దఎత్తున కాంగ్రెస్ ఓట్లు పోలరైజ్ కాకుండా అడ్డుకున్నా బిజెపికి ఆ ఓట్లు కూడా రాకపోయేవనే చర్చ నియోజకవర్గంలో నడుస్తున్నది. మునుగోడు నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల ఇన్‌చార్జిగా వివేక్ వెంకటస్వామినే కావాలని పట్టుబట్టి రాజగోపాల్‌రెడ్డి తెచ్చిపెట్టుకున్నారు. ఆయనకున్న పత్రిక, వార్తాఛానల్ ద్వారా అధికంగా లబ్దిపొందవచ్చని ఆయన భావించారు. కానీ, సీన్ రివర్స్ అయింది. స్టీరింగ్ కమిటీ కారును అదుపు చేయలేకపోయింది. బిజెపిలో పొరపచ్చాలకు దారితీసింది.

ఈటలతో సన్నిహితంగా ఉంటూ రాష్ట్ర నేతలను పట్టించుకోకుండా నేరుగా అమిత్‌షా, కేంద్ర మంత్రులతో రాజగోపాల్‌రెడ్డి సంప్రదింపులు చేయడం రాష్ట్ర నేతలకు మింగుడు పడలేదు. ప్రజాసంగ్రామ యాత్రను మునుగోడు నియోజకవర్గంలో మరిన్ని రోజులు కొనసాగిస్తే తనకు ఉపయోగపడుతుందని రాజగోపాల్‌రెడ్డి వేడుకున్నా బండిసంజయ్ పట్టించుకోకపోవడాన్ని బట్టే వారిమధ్య వైషమ్యాలు నెలకొన్నట్టు అర్థమవుతున్నది. అందుకే ర్యాలీలు, ప్రదర్శనలకు బండి పరిమితమయ్యారుగానీ క్షేత్రస్థాయిలో పెద్దగా ప్రచారం చేయలేదు. కిషన్‌రెడ్డి ఒకటెండ్రు పర్యటనలతో మమా అనిపించుకున్నారు. దీంతో రాజగోపాల్‌రెడ్డి ఒంటరిగా ముందుకెళ్లారు. ఆ క్రమంలో బిజెపి పాతకాపులను అస్సలే పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో బిజెపికి 12 వేల ఓట్లు కూడా పడలేదనీ, పాతవాళ్లు ఉన్నా, పోయినా పెద్దగా నష్టం ఉండదనే ఉద్దేశంతో రాజగోపాల్‌రెడ్డి దూకుడుగా ముందుకెళ్లారు. దీంతో దశాబ్దాలుగా బిజెపి కోసం పనిచేస్తున్నా తమను విస్మరించి కాంగ్రెస్ నుంచి వచ్చినవాళ్లకు పెత్తనం అప్పగించడంపై పాత కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. చాలా మంది పార్టీని వీడారు. పోతూపోతూ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతో రాజగోపాల్‌రెడ్డికి చేటుగా మారింది. మునుగోడు బిజెపి అంతంత మాత్రమే అన్నది జగమెరిగిన సత్యం. పూర్తిగా కాంగ్రెస్ ఓట్లను నమ్ముకుని ముందుకెళ్లే క్రమంలో రాజగోపాల్‌రెడ్డి ప్రదర్శించిన దుందుడుకు చర్యలు ఆయనకు నష్టం చేకూర్చాయి. ఆ నియోజకవర్గ స్థానిక నేత గొంగిడి మనోహర్‌రెడ్డి ఆయనకు పెద్దగా సహకరించలేదు. ఇప్పటికే రాజకీయ పెత్తనం కోసం బిజెపిలో బండి, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఇలా ఎవరికివారు ప్రయత్నాల్లో ఉన్నారు. ఎవరికివారు గ్రూపులు కట్టి కలిసిపోరనే చర్చా ఉంది. దీనికితోడు కొత్తగా ఆ పార్టీలో చేరిన ఈటల రాజేందర్, వివేక్ వెంకటస్వామి, విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, రాజగోపాల్‌రెడ్డి లాంటి వాళ్లు కూడా ఎవరికివారు ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న పరిస్థితి ఉంది.